## 180. నిజమైన భక్తుడు

ఓ సారి నారదుడు వైకుంఠానికి వెళ్ళాడు. ఎప్పటిలా శేషపాన్పు మీద పవళించిన విష్ణుమూర్తి కనబడలేదు. దాంతో లక్ష్మీదేవిని అడిగాడు.

"అమ్మా! విష్ణుమూర్తి ఏరి?"

"ఆయన అర్చన చేస్తున్నారు." జవాబు చెప్పింది లక్ష్మీదేవి.

త్రిలోకాల్లోని వారి చేత అర్చన చేయించుకునే ఆయన ఎవరికి అర్చన చేస్తున్నారో కుతూహలం కలిగిన నారదుడు విష్ణువు వున్న చోటికి వెళ్ళాడు. బంగారు పాత్రలోని గంగాజలాన్ని దక్షిణావృత శంఖంతో తులసి మాలలు అలంకరించిన చిన్న దంతం పెట్టెకి అభిషేకం చేసే విష్ణువుని చూసి అడిగాడు నారదుడు.

"స్వామీ! నీ కన్నా గొప్ప దేవుడు ఎవరున్నారు? ఆ పెట్టెలో ఏముంది?"

"ఇందులో నా భక్తుల పాద ధూళి వుంది." జవాబు చెప్పాడు విష్ణువు.

## 181. దయ

ఓ గ్రామంలో ఓ సన్యాసి తరచు తమ వీధిలోని వృద్ధురాలైన ఓ విధవరాలి దగ్గరకి వెళ్ళి వారింటి అరుగు మీద కూర్చుని, ఆవిడ చెప్పే కబుర్లు వినడం ఓ పెద్ద మనిషి చూసాడు. ఆవిడ చెప్పే పాతకాలం కబుర్లు ఏ మాత్రం ఆసక్తిగా వుండవు. కాబట్టి ఎవరూ ఆవిడ దగ్గరకి వచ్చేవారు కారు. సన్యాసికి కూడా ఆ కబుర్లు రుచించడం లేదని అతను అవి వింటూ అనేకసార్లు ఆవులించడాన్ని బట్టి ఆ పెద్దమనిషి గ్రహించాడు. ఐనా ఆవిడ దగ్గరకి నిత్యం ఓ గంట సేపు వచ్చి కబుర్లు వినడం చూసి ఆశ్చర్యం కలిగిన ఆ పెద్ద మనిషి సన్యాసిని అడిగాడు.

"ఆవిడ చెప్పే విషయాలు మీకేమైనా ఆసక్తిగా వున్నాయా?"

"లేవు." జవాబు చెప్పాడు సన్యాసి.